క్లుప్తంగా

నిరాశ్రయులకు ఉచిత న్యాయ సేవలు

చిత్తూరు అర్బన్: నిరాశ్రయులకు ఉచిత న్యాయ సేవలు అందిస్తామని సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్ అన్నారు. చిత్తూరులోని నిరాశ్రయుల వసతి గృహంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. నిరాశ్రయులకు న్యాయపరమైన సలహాలు ఇచ్చారు. అనంతరం ఆధార్ కార్డులను పంపిణీ చేశారు. వైద్య శిబిరం నిర్వహించి మందులు, మాత్రలు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు జోసెఫ్‌రాజు, డాక్టర్ బాలాజీ, సిబ్బంది కవిత, రాధ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


పౌష్టికాహారం అందజేత

ఐరాల: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తోందని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం పీహెచ్‌సీలో టీబీ ముక్త్ భారత్ రీడ్స్ వాలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో క్షయవ్యాధి గ్రస్తులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ మొదటి దశలో గుర్తించి సరైన వైద్యంతో పాటు పౌష్టికాహారం తీసుకుంటే క్షయ వ్యాధిని నయమవుతుందని తెలిపారు. సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 'ఘంటసాల శతజయంతి గానామృతం'

చిత్తూరు రూరల్: ఘంటసాల శతజయంతి గానమృతం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఘంటసాల, బలిజ అభ్యుదయ సేవా సమితి అధ్యక్షుడు రవినాయుడు కోరారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఘంటసాల శతజయంతి గానామృతం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తామన్నారు. చిత్తూరువాసులు, కవులు, సాహితీవేత్తలు, ఘంటసాల అభిమానులు పాల్గొన్ని జయప్రదం చేయాలని కోరారు.

అభివృద్ధి పనుల పరిశీలన


చామంచిపురంలో స్థల పరిశీలన చేస్తున్న సీఈఓ ప్రభాకర్‌రెడ్డి

ఐరాల : మండలంలోని పాలకల పంచాయతీలో అభివృద్ధి పనులను శనివారం జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. అలాగే డీఎంఎఫ్ నిధులతో గూడురుపల్లె, గూడురుపల్లె దళితవాడ, చల్లవారిపల్లెలో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్లు, చామంచిపురంలో గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి అందిన ప్రతిపాదనలపై స్థల పరిశీలన చేశారు. ఆయన వెంట ఎస్ఈ పీఆర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఈ పీఆర్ఐ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.50 వేలు విరాళం

శాంతిపురం: మండలంలోని కెనమాకులపల్లిలో స్థానికులు నిర్మిస్తున్న ఆలయానికి ఎమ్మెల్సీ భరత్ రూ.50 వేలను విరాళంగా అందించారు. శనివారం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్సీ స్థానికుల విజ్ఞప్తి మేరకు నిర్మాణంలోని ఆలయాన్ని పరిశీలించారు. భక్తులు చందాలు వేసుకుని నిర్మిస్తున్న పుంగాన్తం ఆలయాన్ని పూర్తి చేయడానికి సాయం చేయాలని తమిళనాడు నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన గ్రామస్తులు కోరారు. దీనిపై స్పందించిన భరత్ తక్షణం రూ.50 వేల నగదును వారికి అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, నాయకులు చెంగప్ప, ఏవీ జయరాం, జగన్‌నాయుడు, పూంగావనం పాల్గొన్నారు.

క్రీడలూ అవసరమే..


యువజన వారోత్సవాల ప్రారంభోత్సవంలో ప్రసంగిస్తున్న సీఐ శ్రీధర్

కుప్పం: విద్యతో పాటు విద్యార్థులకు క్రీడలు కూడా ఎంతో అవసరం అని కుప్పం అర్బన్ సీఐ శ్రీధర్ తెలిపారు. శనివారం కుప్పం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో యువజన వారోత్సవాల సందర్భంగా క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ మధ్యకాలంలో యువత డ్రగ్స్ వినియోగానికి అలవాటు పడుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదని సూచించారు. డ్రగ్స్‌కు అలవాటు పడినా వారి భవిష్యత్ అంధకారంగా మారుతుందన్నారు. పిల్లలపై ఎన్నో ఆశలు పెట్టుకున్నా తల్లిదండ్రులు అన్యాయం చేసిన వారు అవుతారని ఆయన సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదువుకుని భవిష్యత్‌ను బంగారుబాట వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, ఎస్ఐ శివకుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ఊపిరి

- చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు


లబ్ధిదారురాలు పొందిన పథకాల లబ్ధిని బుక్‌లెట్‌తో తెలియజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: పేదల సంక్షేమమే ఊపిరిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. చిత్తూరు మండలం చెర్లోపల్లెలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలు పొందిన పథకాల లబ్ధిని బుక్‌లెట్లు అందజేసి తెలియజేశారు. తన దృష్టికి నివేదించిన సమస్యల్లో కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయంతో వ్యవసాయరంగాన్ని బలోపేతం చేస్తోందని, సాయం మూలాన బీడు భూములన్నీ పంటలతో కళకళలాడుతున్నాయని చెప్పారు. రైతు భరోసా కేంద్రాల సేవలను, ప్రజలకు భరోసా ఇస్తున్న వివిధ పథకాలను తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ ప్రతిమారెడ్డి, నాయకులు త్యాగరాజులు, సంపత్, అమరనాథ్‌రెడ్డి, సుదర్శన్, కన్నన్, హరినాథ్‌రెడ్డి, పాండియన్, పూర్ణచంద్రరెడ్డి, సుబ్రమణి, హరి, దేవేందర్, దర్మారెడ్డి, ప్రసాద్, జైపాల్, మణిరత్నం, దిలీప్, రాజేంద్ర, రంజన్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో విద్యుద్దీకరణ పనులు వేగవంతం చేయండి

- గడప గడప పనులకు రూ.60 లక్షలు
- ట్రాన్స్‌కో రూరల్ ఈఈ హరి


మాట్లాడుతున్న ఈఈ హరి

చిత్తూరు కార్పొరేషన్: జగనన్న కాలనీల్లో విద్యుద్దీకరణ పనులను వేగవంతం చేయాలని ట్రాన్స్‌కో రూరల్ ఈఈ హరి ఆదేశించారు. శనివారం ఆయన తన కార్యాలయంలో డీఈ, ఏఈఈలతో సమీక్షించారు. ‹గడప గడపకు మన ప్రభుత్వం›లో వచ్చిన వినతులను పరిష్కరించడానికి నిధులు విడుదల చేశారన్నారు. ఇందులో జిల్లాలోని మేజర్ 40 పనులకు రూ.60 లక్షలు వచ్చిందన్నారు. వీటి ద్వారా లైన్ల మార్పిడి, విస్తరణ, పోల్స్ ఏర్పాటు పనులు చేయాలన్నారు. కాలనీల్లో సెక్షన్ల వారీగా ఎన్ని కరెంటు స్తంభాలు, మీటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కావాలో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఈనెలలోపు పెండింగ్ వ్యవసాయ సర్వీసులను విడుదల చేయాలన్నారు. అలాగే వ్యవసాయ సర్వీసులకు అమర్చనున్న మీటర్లకు సంబంధించి రైతుల ఖాతాల అప్‌డేట్‌ను త్వరగా పూర్తి చేయాలన్నారు. సమీక్షలో డీఈ హేమకుమార్, ఏఈఈలు చలపతి, బాలాజీ, గుర్రప్ప, రామిరెడ్డి, ఇన్‌చార్జి ఏఈ వేలు తదితరులు పాల్గొన్నారు.

పఠనా సామర్థ్యాన్ని పెంపొందించాలి


మాట్లాడుతున్న ఎంఈఓ

ఐరాల: విద్యార్థుల్లో పఠనా సామర్థ్యాలను పెంపొందించాలని ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. శనివారం ఎంఈఓ కార్యాలయ ఆవరణలో మండలంలోని హెచ్‌ఎంలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరంలో విద్యా వార్షిక ప్రణాళిక, హేబిటేషన్ వార్షిక ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు.

నిత్యం స్పందన నిర్వహించాలి


రికార్డులను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: సచివాలయాల్లో ప్రతి నిత్యం స్పందన కార్యక్రమం నిర్వహించాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. శనివారం ఆయన పట్టణంలోని అంబేడ్కర్ నగర్ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టిక, సీఎల్, మూమెంట్ రిజిస్టర్లు, స్పందన, సచివాలయ సర్వీస్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిత్యం సాయంత్రం వేళ సచివాలయాల్లో తప్పనిసరిగా స్పందన కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. స్పందనలో వచ్చిన సమస్యలను వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

విద్యార్థికి ల్యాప్‌టాప్ వితరణ



తిరుచానూరు: ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ వర్సిటీలో ఏంఏ ప్రవేశ పరీక్షలో దామినేడుకు చెందిన ఉమేషచంద్రనాయక్ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో మూడో స్థానం సాధించారు. ఆయనకు తిరుచానూరు సర్పంచ్ కె.రామచంద్రారెడ్డి శనివారం సుమారు రూ.50 వేల విలువైన ల్యాప్‌టాప్ వితరణ చేశారు.

దత్తతకు నెమలి

తిరుపతి అలిపిరి: ఎస్వీ జూపార్క్‌లోని నెమలిని తిరుపతికి చెందిన హరినాథరెడ్డి కుటుంబ సభ్యులు దత్తత తీసుకున్నారు. నెమలికి ఏడాదికి సరపడా ఆహారం అందించడానికి రూ.21,900 జూ క్యూరేటర్ సెల్వంకు అందజేశారు. ఏటా ఆనవాయితీగా హరినాథరెడ్డి సతీమణి చరిష్మ పేరిట సాయం ఇస్తున్నట్లు దాతలు చెప్పారు.

శరవేగంగా సాగర్ పనులు


పనులను పరిశీలిస్తున్న మేయర్, కమిషనర్

తిరుపతి తుడా: వినాయకసాగర్‌లో మొదటి దశ పనులను పూర్తిచేసి ఫిబ్రవరిలో ప్రారంభించనున్నట్టు మేయర్ శిరీష తెలిపారు. ఆమె శనివారం కమిషనర్ అనుపమ అంజలితో కలిసి వినాయకసాగర్ అభివృద్ధి పనులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ హుస్సేన్ సాగర్ తరహాలో వినాయక సాగర్ ఆహ్లాదాన్ని పంచనుందన్నారు. సకాలంలో పనులు పూర్తి చేయాలని, లేని పక్షంలో చర్యలు వుంటాయని సిబ్బందిని హెచ్చరించారు. వారి వెంట ఎస్ఈ మోహన్, కాంట్రాక్టర్ రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన


మామిడికాయల మార్కెట్ స్థలాన్ని పరిశీలిస్తున్న మార్కెటింగ్ సంచాలకులు రామాంజనేయులు

పలమనేరు: పలమనేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను కడప ప్రాంతీయ సంయుక్త మార్కెటింగ్ సంచాలకులు రామాంజనేయులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మార్కెట్‌కమిటీలో వివిధ విభాగాలను తిరిగి చూశారు. క్యాటిల్‌ఫామ్ వద్ద నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ టమాటా మార్కెట్ పనులను పరిశీలించారు. అలాగే వీ.కోట మండలంలోని శివునికుప్పం వద్ద జరుగుతున్న మామిడికాయల మార్కెట్ పనులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే మామిడి సీజన్‌లోపు ఇక్కడ వ్యాపారాలను ప్రారంభించేలా చొరవ చూపాలని స్థానిక మార్కెట్ కమిటీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డికి సూచించారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, ఎమ్మార్ వేణు, కార్యదర్శి సంజీవకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు


వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారితో ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: మండలంలోని బందార్లపల్లి పంచాయతీ లింగాపురానికి చెందిన టీడీపీ కార్యకర్తలు ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, స్థానిక సర్పంచ్ రాజ్‌గోపాల్ ఆధ్వర్యంలో శనివారం వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వారికి ఎమ్మెల్సీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలోకి చేరిన వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చేరినట్లు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో రియాజ్‌బాషా, బషీర్, ఇస్మాయిల్, అశ్మత్‌బాషా ఉన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ కో కన్వీనర్ చంద్రారెడ్డి, సీనియర్ నేతలు రామకృష్ణారెడ్డి, కేశవరెడ్డి, సుగుణప్ప పాల్గొన్నారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు

యాదమరి: గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారులందరికీ వ్యాధి నిరోధక టీకాలు వేయాలని వైద్యాధికారి శ్రీనివాస్ నాయక్ తెలిపారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం, కోడిగుట్ట ఆరోగ్య ఉపకేంద్రంలో చిన్నారులకు వైద్య సిబ్బంది వేస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతు వైద్య సిబ్బంది టీకాలు వేయడంతోపాటు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జల్లికట్టు నిర్వహిస్తే కేసులు

గుడిపాల: సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో జల్లికట్టు, జూదం, కోడిపందేలు నిర్వహిస్తే కేసులు తప్పవని ఎస్ఐ రాజశేఖర్ హెచ్చరించారు. శనివారం మండలంలోని వెప్పాలమానుచేను, చిత్తపార, బండపల్లె పంచాయతీలో గ్రామస్తులకు సమావేశం నిర్వహించి ఎస్ఐ మాట్లాడారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం


ఆలయ అధికారులకు చెక్కును అందిస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి తెలంగాణ రాష్ట్రం కొత్తగూడెంకు చెందిన మాధవ రూ.లక్ష విరాళంగా అందజేశారు. శనివారం సాయంత్రం ఆయన కుటుంబ సభ్యులతో ఆలయానికి విచ్చేశారు. ఆలయ అధికారులను కలసి ఈమేరకు విరాళాన్ని అందజేశారు. వారికి ప్రత్యేక దర్శనం కల్పించారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వచనం చేసి, తీర్థ ప్రసాదాలు అందించారు.

వినాయకుని సేవలో కర్ణాటక న్యాయమూర్తి


జస్టిస్ అశోక్ ఎస్.ఖినగికి తీర్థప్రసాదాలు అందజేస్తున్న ఏఈఓ రవీంద్రబాబు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామిని శనివారం కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అశోక్ ఎస్.ఖినగి దర్శించుకున్నారు. ఉదయం ఆయన ఆలయానికి విచ్చేయగా ఏఈఓ రవీంద్రబాబు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనం అందజేయగా, స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలను ఏఈఓ రవీంద్రబాబు అందజేశారు.

పెండింగ్ బకాయిలు చెల్లించరూ..!


మాట్లాడుతున్న మనోహర్ రెడ్డి

పలమనేరు: పదకొండో పీఆర్సీకి సంబంధించిన పెండింగ్ డీఏ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఏపీ పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు మనోహర్ రెడ్డి సూచించారు. పట్టణంలో పెన్షనర్ల కార్యాలయంలో శనివారం సంఘ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్‌నే నమ్ముకున్న తమ కుటుంబాలకు సకాలంలో పింఛను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గడువు మీరితే ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో సంఘనేతలు వెంకటకృష్ణయ్య, గురుమూర్తి, రత్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో కోవిడ్ దూరం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: జాగ్రత్తలు పాటించడం ద్వారా కోవిడ్ మహమ్మారికి దూరంగా ఉండవచ్చని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పూర్ణలత తెలిపారు. శనివారం మండలంలోని గుండ్లపల్లెలో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా 104 వాహనం ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోవిడ్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతి ఒక్కరూ విధిగా మాస్కులు ధరించాలని చెప్పారు. రద్దీ ప్రదేశాల్లో భౌతికదూరం పాటించాలని తెలిపారు. అనంతరం 60 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఎత్తు, బరువు పరీక్షలు చేశారు. బరువు తక్కువగా ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులను పిలిచి సరైన పోషకాహారం అందించాలని సూచించారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ చేయించుకున్నవారి ఇంటి వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు ఇచ్చారు. హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, హెల్త్ సూపర్‌వైజర్ శంకరమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ సౌజన్య, ఏఎన్‌ఎం విమల, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం


పుణ్యసముద్రంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తవణంపల్లె: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు గ్రామాల్లో పర్యటించి జోరుగా ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ సిద్ధంపల్లె హరిరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని పట్నం, పుణ్యసముద్రం నలిశెట్టిపల్లె సెగ్మెంట్‌ల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మద్దతుతో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న శ్యాంప్రసాద్‌రెడ్డికి ఓటు వేసి పట్టభద్రులు గెలిపించాలని అభ్యర్థించారు. నాయకులు గాంధీబాబు, పరమేశ్వరరెడ్డి, ప్రకాష్ బాబురెడ్డి, మధుకుమార్, విక్రాంతిరెడ్డి, సుకేష్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, స్వరూప్‌రెడ్డి, మురళీరెడ్డి, హరిప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు


పింఛన్లు పొందిన వారితో ఎంపీపీ, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్

గుడిపాల: అర్హులందరికీ ఠంచన్‌గా ఒకటో తేదీనే పింఛన్లు ఇస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య తెలిపారు. మండలంలోని 189 కొత్తపల్లెలో శనివారం పింఛన్లను పంపిణీ చేసి వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉపేంద్ర, సర్పంచ్ పెరిల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు సంపత్, శిలంబరసన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పడమటి ప్రాంతాలకు తాగునీరు


మిథున్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మహిళలు

- పుంగనూరులో అభివృద్ధి పరుగులు
- రెచ్చగొట్టే వారి పట్ల సంయమనం పాటించండి
- ఎంపీ మిథున్‌రెడ్డి

పుంగనూరు: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పడమటి నియోజకవర్గాలకు సాగు, తాగు నీరు అందించడం జరుగుతోందని, అందుకోసం హంద్రీనీవా కాలువ సామర్థ్యాన్ని పెంచి మూడు రిజర్వాయర్లు నిర్మిస్తున్నామని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన పుంగనూరు పట్టణంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నీటి సమస్య తీర్చేందుకు నేతిగుట్లపల్లె రిజర్వాయర్‌లో ఒక టీఎంసీ నీటిని, ఆవులపల్లె రిజర్వాయర్‌లో మూడు టీఎంసీల నీరు నిల్వలు ఉండేలా రిజర్వాయర్ల పనులు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు. అలాగే తంబళ్లపల్లె నియోజకవర్గంలో రిజర్వాయర్ నిర్మిస్తున్నామన్నారు. హెచ్‌ఎన్‌ఎస్ కాలువల విస్తరణ పనులు చేపట్టి పుంగనూరు, పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాలకు తాగునీరు, సాగునీరు సమస్య లేకుండా చేయనున్నట్లు తెలిపారు. అలాగే వైఎస్సార్ జిల్లా గండికోట నుంచి పైపులైన్లు వేసి పడమటి నియోజకవర్గాలకు నీటి సమస్య లేకుండా చేసే బృహత్తర కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిందన్నారు. వచ్చే 30 ఏళ్ల వరకు కూడా మంచినీటి సమస్య తలెత్తకుండా ఉండేలా ఈ కార్యక్రమం రూపొందించామన్నారు. నియోజకవర్గంలో అన్నిరకాల అభివృద్ధి చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, వైస్ చైర్మన్లు నాగేంద్ర, లలిత, వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము , వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి ఫక్రుద్దీన్‌షరీఫ్ తోపాటు కౌన్సిలర్లు , అధికారులు పాల్గొన్నారు.

తిరుమలపై విష ప్రచారం తగదు

తిరుపతి అలిపిరి: కొందరు పనిగట్టుకొని తిరుమల క్షేత్రంపై తప్పుడు ప్రచారాలు చేస్తూ టీటీడీ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారని టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్ కుమార్ మండిపడ్డారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. తిరుమలలో పాడైన అద్దె గదులను రూ.119 కోట్లతో ఆధునీకీకరణ పనులు చేపట్టినట్టు తెలిపారు. ఎస్టేట్ కమిటీ సభ్యుడిగా తాను కూడా పనులను పర్యవేక్షించినట్టు తెలిపారు. చక్కటి వసతులు సమకూర్చిన నేపథ్యంలో గదుల అద్దె మార్చాల్సి ఉందని తెలిపారు. ప్రస్తుతానికి సాధారణ భక్తులకు ఇచ్చే రూ.50, రూ.100 అద్దె అలాగే ఉన్నట్టు తెలిపారు. తిరుమల క్షేత్రంలో చిన్న విషయాన్ని కూడా భూతద్దంలో చూస్తూ విష ప్రచారం చేస్తున్న పత్రికలు, విమర్శకులు వాస్తవాలను గ్రహించాలని హితవు పలికారు.

వేప చెట్టు నుంచి పాలు


వేప చెట్టు నుంచి కారుతున్న పాలు

వెదురుకుప్పం: మండలంలోని కురివికుప్పం పంచాయతీ పరిధి అడపాలబైలు గ్రామ సమీపంలో ఓ వేప చెట్టు నుంచి పాలు కారడం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేసింది. వేప చెట్టు పైకొమ్మ నుంచి పాలు కారుతున్నట్లు తెలియడంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు కూడా అక్కడికి వచ్చి తిలకించారు. అదేదో వింత అంటూ ఒకింత విస్మయానికి లోనయ్యారు. అయితే అది వింత కాదని, శాస్త్రీయమని జన విజ్ఞాన వేదిక మండల నాయకుడు మునిరత్నం స్పష్టం చేశారు. వేపకాండంమీద పగుళ్లు ఉన్నప్పుడు ఎన్నో జీవులు, శిలీంద్రాలు, లక్షలాది పురుగులు నివాసం ఉంటూ చనిపోతాయన్నారు. కొంత కాలానికి అది ద్రవంగా మారి వేపకాండం, బెరడు నుంచి పాలుగా కారుతుందని వివరించారు. వింతేమి కాదని, మూఢ నమ్మకాలను ప్రజలు వీడాలని తెలిపారు.